నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 5-5-2022

## మబ్బులు వీడిన ఆకాశం

ఆకాశం ఎంత విశాలమైనా
చిన్న చిన్న మబ్బులు చాలు
కమ్మి చీకటి చేయడానికి.
కొలను ఎంత లోతున్నా
చిన్న రాయి చాలు
అల్లకల్లోలం చేయడానికి.
కాస్తంత కలతతో
కొండంత నిబ్బరానికి తూట్లు.

గాత్ర గాంభీర్యం జీరబోవచ్చు
మత్త గజం తట్టి పడొచ్చు
ఉడుము పట్టు తప్పొచ్చు
అరుదుగా సంభవించే
అపసవ్యాలు, అస్తవ్యస్తాలు
కావెప్పుడూ తటస్థం.
ఎంత సహజమైనా
తొట్రుపాట్లు కావు శాశ్వతం.

చిరు దీపం
చిమ్మ చీకటిని పారద్రోలినట్లు
కాస్తంత ఓపిక వహిస్తే
మనసంతా మబ్బులు వీడిన ఆకాశమే!



–ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## ఘంటారావం

కామాతురుల చరితలు
కన్నీటి వెతలే
లకుమ కోసం లోకువైన
కుమారగిరి కథలే.

మాపటికే లేకుంటే
రేపటి మాటెందుకు?
చెట్టు ఒట్టిపోతుంటే
అంటు కట్టుటెందుకు?

ఎదిగిన ఎత్తును కాదు
వేసిన ఎత్తును చూడు
పొందిన సత్తువ కాదు
చిందిన నెత్తురు చూడు.



–గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## ఏడాది జాబిలి

ఏ కాంతిరేఖలూ ముక్కలవని
ఓ చక్కదనం !
ఏకాంతాన్ని ముక్కలు చేసే ఓ చిక్కదనం !
అమాయక శబ్ద సౌందర్యాన్ని వెంటేసుకొని
కొంటెనవ్వుల చిలిపిదనాన్ని కంట్లో వేసుకొని
నెలల పాపాయి ఎదుగుతున్నది
ఉంగా ఉంగాలన్నీ కేరింతలై పురివిప్పుతున్నవి
స్వరపేటికలో గాలి తన రూపాన్ని సవరించుకుంటున్నది
కొత్త చూపుల గాలాలకు వస్తువులన్నీ తన ఆట సాధనాలే.

ఏరివేత పారవేతల శబ్దమే జీవితం
ఇంటినిండా చిందరవందర దృశ్యాల గుచ్ఛాలే
ఎగరాలనే గెంతుల అడుగుల జాడలు
వింతగానే చెంతకొస్తుంటాయి

నెలవంక పున్నమైనట్లు
మనసు వాకిలిలో పిలుపు వాక్యాలన్నీ
అరచేతులకు లాగుతుంటే
ఆకలి తెలియనివ్వదు, ఆచేతనలో పడెయ్యదు
పనుల గడబిడ అంతా కబ్బోర్డు సొరుగుల్లో దాచి
దాగుడు మూతలైనప్పుడు
వెన్నెల ఎత్తుకునే పనిలోపడి నేను నవ్వుల చకోరమైపోతాను
వడిలో లేనప్పుడు మనస్సును
బిగించి ముచ్చట్ల
ముళ్ళేయమంటుంది.
నోట్లోని వేలు నాన్నమ్మకు ఒప్పజెప్పి
లోకాల సంతోషాలు తెచ్చి కట్టేస్తుంది.
నడకలు నాట్యానికి ఒప్పజెప్పి
పుట్టినరోజుకు సిద్ధమవుతున్నది.
–డా॥ కొండపల్లి నీహారిణి



– కొండపల్లి నీహారిణి
సెల్:9866360082

## నానీలు

బిందెలో నీళ్ళు నిల్
బీరుబాటిళ్ళైతే ఫుల్
ఓహో!
ఇది వేసవి కాలమే.

సాంస్కృతిక కార్యక్రమాలు
లేవని బాధా?
కరోనా
నృత్యం చేసిందిగా

పుస్తకాలు
ఎన్ని ఉంటే ఏమిటి?
చదివే పాఠకుడే
లేనప్పుడు!

అక్షరాలు
అల్లుకుంటేనే
టీ.వీ అయినా
సినిమా అయినా.

టామీ జెర్రీనే
ప్రపంచ ఆటా?
కరోనా కూడా
ఆడింది ఆరోగ్యంతో క్రీడ.



–చలపాక ప్రకాష్
సెల్:9247475975

## మాతృమూర్తి స్పర్శకు ప్రతీకలు మంత్రసానులు

### (05 మే 'అంతర్జాత మంత్రసానుల దినం' సందర్భంగా)

ప్రతి ఏటా 05 మే రోజున 'ఇంటర్నేషనల్ కన్ఫెడరేషన్ ఆఫ్ మిడ్‌వైఫ్స్' నేతృత్వంలో 'అంతర్జాతీయ మంత్రసానుల దినం (ఇంటర్నేషనల్ మిడ్‌వైఫ్స్ డే)' ఘనంగా, గర్వంగా నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది. ఇంటర్నేషనల్ మిడ్‌వైఫ్స్ డే–2022 నినాదంగా 'శతాబ్దపు ప్రగతి' అనే అంశాన్ని తీసుకొని పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రసవ సేవలు, పురుటి నొప్పులు, గర్భిణి సేవలు, సంతానోత్పత్తి, లైంగిక సమస్యలు, మాతృత్వ విధులు, నవజాత శిశు లాలన, ప్రసవానంతర సూచనలు, పిల్లలు, కౌమారదశ యువత ఆరోగ్య సమస్యలు లాంటి బహువిధ సేవలను నిస్వార్థంగా అందించే పవిత్ర మంత్రసాని వృత్తిని గౌరవించడం, వారికి కృతజ్ఞతలు తెలియచేయటం మన కనీస బాధ్యతగా గుర్తించాలి. ప్రపంచవ్యాప్తంగా మంత్రసానులు ఏకమై ఈ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం పరిపాటి అయ్యింది. శిశు జననం, నవజాత శిశువు ఆరోగ్యం మంత్రసానుల విధి నిర్వహణపై మాత్రమే ఆధారపడి ఉంటుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నేతృత్వంలో విడుదల చేసిన 'ప్రపంచ మంత్రసాని వృత్తి నివేదిక ఆధారంగా మంత్రసాని వృత్తి పట్ల ప్రత్యేక శ్రద్ధ, ప్రసవ సమయ జాగ్రత్తలు/ నవజాత శిశువు రక్షణ లాంటి అంశాల్లో సరైన శాస్త్రసాంకేతిక శిక్షణ తప్పక అందించాలని ఐరాస సభ్యదేశాలకు సూచనలు చేసింది. ఐరాస నిర్దేశించిన 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు–3.1' ప్రకారం 2030 నాటికి ప్రతి లక్ష ప్రసవాలలో శిశు మరణాలు 70 కన్న తక్కువ ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని నిర్ణయించి, కార్యాచరణ రూపొందించారు. 1991లో ప్రారంభమైన వరల్డ్ మిడ్‌వైఫరీ డే సందర్భంగా ర్యాలీలు, పోటీలు, మంత్రసానులకు పుష్పగుచ్ఛాలు అందించడం, పలు కార్యశాలలు నిర్వహించడం జరుగుతోంది. మాతాశిశు సంక్షేమానికి పునాది వేసిన వారిలో మంత్రసానుల పాత్ర అద్వితీయం, అనితర సాధ్యం. ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 850 గర్భిణి మహిళలు, 2 మిలియన్ల నవజాత శిశువులు, 2.6 మిలియన్ల గర్భంలోని శిశువులు మరణించడం జరుగుతోందని వివరాలు తెలుపుతున్నాయి. శిశువుకు అమ్మగా, ప్రసవ వేదన పడుతున్న మహిళకు తల్లిగా, గర్భిణి కుటుంబ సభ్యురాలిగా, గర్భిణి స్త్రీకి సోదరిగా అనేక పాత్రలు పోషించే మంత్రసానులకు తగిన గౌరవం సమాజంలో దక్కడం లేదు. మంత్రసానులు లేకుండా జరిగే కాన్పులలో తల్లికి, శిశువుకు ప్రమాదకరంగా మారుతుందని మనకు తెలుసు. మంత్రసాని చేతిలో అమృత స్పర్శ ఉంది. తమ వ్యక్తిగత సమస్యలను పక్కన పెట్టి నవజాత శిశువును మృదువుగా, ప్రసవ వేదనలో ఓపికకు రూపంగా, మాతాశిశు రక్షణలో వైద్యురాలిగా తన విధులను సర్వోన్నత నిష్టతో నిర్వహించే మంత్రసానికి మాతా శిశువులు సదా కృతజ్ఞతలు తెలియజేయాల్సిందే. మంత్రసానులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు వ్యక్తం చేయడానికి మగ మహారాజులు మరువకుండా మరింత చొరవ తీసుకోవాలి.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## 'ఆనందలహరీ', 'మనం మరచిన మణి భంజికలు"ఆవిష్కరణ

స్థానిక త్యాగరాయ గాన సభ – కళా సుబ్బారావు కళా వేదిక లో మరోసారి తెలుగు తల్లి మనసు పరవశించింది. "ఆనంద లహరి" అనే సంస్థ ఆధ్వర్యంలో సహృదయ – సద్భావ రచయిత శ్రీ కోమరవోలు శేష శ్రీ రామచంద్ర మూర్తి గారు రచించిన "మనం మరచిన మణి భంజికలు" మరియు "అంతర్చక్షువు" అనే పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ప్రముఖ పద్యకవి "శ్రీ రాధశ్రీ" గారు మరియు రచయిత సోదరులైన శ్రీ కోమరవోలు శేష తల్ప రంగారావు గారి చేతుల మీదుగా ఈ పుస్తకాలను "తెలుగు భాషాభిమానులకు" అంకితం చేయడం జరిగింది. జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త "శ్రీ దైవజ్ఞ శర్మ" గారు మాట్లాడుతూ – "ఆ రామచంద్రుని ఆశీస్సులు ఈ రామంచంద్ర మూర్తికి ఉండాలని" ఆకాంక్షిస్తూ "రచయితకు సహకరించి ప్రోత్సహించిన వారి ధర్మ పత్ని ఉమాదేవి గారిని" అభినందిస్తూ – ఆశీస్సులు అందచేశారు. సభలో పాల్గొన్న శ్రీయుత వేమూరి శివరామ కృష్ణ ప్రసాద్ (జమునా గ్రామీణ బ్యాంక్ – పూర్వ చైర్మన్ ) ; నేటి నిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు, తెలుగు భాషను పల్లకి ఎక్కించడానికి ఎప్పుడు ముందుండే మరో ప్రముఖ రచయిత శ్రీ రఘుశ్రీ ఇంకా ఇతర ఆత్మీయ అతిథులైన "తెలుగు వెలుగు" బృంద సభ్యులు శ్రీ మాచిరాజు శ్రీ రంగం శేషశాయి ; శ్రీ పులిపాక వెంకట లక్ష్మీ కాంతారావు గార్లు రచయితకు అభినందనలు తెలియ చేసారు. కంద పద్యానికి ప్రాణం పోసే "శ్రీ రాధ శ్రీ" గారు "పద్య భాషణం" ద్వారా రచయితను అభినందిస్తూ – వేదికకు శోభ చేకూర్చిన వారందరినీ "పద్యాల మాలలతో" సత్కరించారు.

ప్రతిగా తన స్పందనను తెలియచేస్తూ రచయిత మూర్తి గారు రచనా వ్యాసంగంలో తనకు ప్రేరణ ఇచ్చిన కుమారుడు కృష్ణ కిషోర్ మరియు కుమార్తె దుర్గా మానసలను తలచుకుంటూ తన రచనా ప్రయాణాన్ని వివరించారు. వీరిద్దరితో పాటు తాను రచించిన పుస్తకాలన్నీ తన "మానస పుత్రికలే" అంటూ చమత్కరించారు ...

కార్యక్రమంలో కురుగంటి కళాక్షేత్రం వారి బృందం ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన – శ్రీ భిక్షు యాదవ్ గారి మిమిక్రీ – శ్రీ కాజా గారి ఇంద్ర జాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి.

సభా నిర్వహణ కార్యక్రమాన్ని కళారత్న మల్లం రమేష్ గారు చక్కగా నిర్వహించగా ప్రార్థనా గీతాన్ని ఇంకా సన్మాన పత్రాన్ని ప్రముఖ కాస్ట్ అకౌంటెంట్ దెందుకూరి జితేంద్ర రావు సమర్పించారు.

వందన సమర్పణ చేస్తూ మల్లం రమేష్ – సభకు రాలేక పోయిన శ్రీ పోలాప్రగడ జనార్దన రావు గారు ఫోన్ ద్వారా తెలియ చేసిన అభినందనలను ప్రస్తావించారు.

జాతీయ గీతంతో సభ విజయవంతంగా ముగిసింది.



పుస్తకావిష్కరణలో మాచిరాజు శ్రీరంగం శేషశాయి, పులిపాక వేంకట లక్ష్మీకాంతారావు, రఘుశ్రీ, బైస దేవదాసు, వేమూరి శివరామకృష్ణ ప్రసాద్, కొమరవోలు శేష శ్రీరామచంద్రమూర్తి, దైవజ్ఞశర్మ, రాధశ్రీ, కొమరవోలు శేషతల్ప రంగారావు, కళారత్న మల్లం రమేష్.



రచయిత కొమరవోలు శేష శ్రీరామచంద్రమూర్తి దంపతులను సత్కరిస్తున్న అతిథులు



నృత్య ప్రదర్శనలు చేసిన కురుగంటి కళాక్షేత్రం బృందం, నాట్యగురువు శ్రీమతి రాధికతో అతిథులు.

## బంధాలన్నీ ఆర్థికమే

(కథ)

యాదయ్య బయటి నుండి వచ్చే సరికి తల్లీ కొడుకులు పెళ్లి కానుకలుగా వచ్చిన డబ్బు, కవర్ల నుండి తీయడంలో నిమగ్నమై ఉన్నారు. యాదయ్య మనసులో 'వాళ్ల వాలకం చూస్తే, ఎవరెంత డబ్బు కట్నంగా ఇచ్చారో, ఓ పట్టిక తయారు చేయాలనే ఇంగితం కూడా లేనట్టుంది.'

"మంగా! నేనొచ్చేదాకా ఆగలేకపోయారా? ఈ కవర్లు ఇప్పుడే చించడానికి అంత తొందరేమొచ్చింది?"

"ఎప్పుడైనా కానుకలుగా వచ్చిన డబ్బు, లెక్క చూసుకోవాల్సిందే కదా? మీరు మాత్రం తర్వాత వేరే ఇంకేం చేసేవారు?" పుత్రరత్నం జవాబు.

"అది కాదు సాయీ! ఈ డబ్బు, ఓ పద్ధతి ప్రకారం లెక్క పెట్టాలి. ఎవరెంత ఇచ్చారో ఓ పట్టికలో రాసి, వారింట్లో ఏదైనా శుభకార్యం జరిగినప్పుడు, అంతేనో లేక అంతకంటే కొంత ఎక్కువో చదివించవచ్చు. అప్పుడు మనం ఎవరికీ రుణపడి ఉండం" యాదయ్య అన్నాడు.

"మీవన్నీ చాదస్తపు ఆలోచనలు నాన్నా! ఈ రోజుల్లో అలాంటివెవరూ పట్టించుకోవడం లేదు." సాయిరాం మొండి వాదన.

"నీ మొత్తం పెళ్లి ఖర్చు నేనే పెట్టాల్సి వచ్చింది. దానికి కొంత అప్పు కూడా చేయాల్సి వచ్చింది. పెళ్లిలో కానుకలుగా వచ్చిన డబ్బుతో అంతో ఇంత అప్పు తీరుతుందని ఆశలు పెట్టుకున్నాను. మీ వాలకం చూస్తుంటే నా నెత్తిన శఠగోపం పెట్టేట్టున్నారు." యాదయ్యలో ఆక్రోషం.

"అలా అనడానికి నీకు సిగ్గూ, శరం లేదూ? కన్న పాపానికి, పిల్లలను పెంచి పెద్దజేయడం, ఇంటికి పెద్దగా అది మీ బాధ్యత. ఈ డబ్బు మీద, నేనూ సాయి కూడా ఆశలు పెట్టుకున్నాం. మా పుట్టింటి పెట్టుపోతలకు నేనూ, తమ హనీమూన్ ఖర్చులకు సాయీ చెరిసగం తీసుకోవాలని ఎప్పుడో అనుకున్నాం. మీ అప్పులు, మీ బాధ్యత. వాటికీ ఈ డబ్బుకీ లంకె పెట్టకండి." మంగమ్మ కట్టె విరిచింది.

యాదయ్య తన కుటుంబ నేపథ్యంలోకి పరుగెత్తాడు. వెనుకబడ్డ ప్రాంతంలోని ఓ మారుమూల పల్లెలో పుట్టిన తన తండ్రి మైసయ్య, తన కుటుంబపోషణకై తమ కులవృత్తి దర్జీ పనిపైనే ఆధారపడ్డాడు. ఆ పల్లెటూర్లో తగినంత పనిలేక, కుటుంబాన్ని తమ ఊర్లోనే ఉంచి పొరుగు రాష్ట్రానికి వలస వెళ్లాడు మైసయ్య.

యాదయ్య స్కూల్ ఫైనల్ అయ్యేసరికి తన తోబుట్టువుల పెళ్లిళ్లు చేసి మైసయ్య చితికి పోయాడు. యాదయ్య చదువు అటకెక్కింది. తన తండ్రికి తోడుగా దర్జీ పనిలోనే స్థిరపడ్డాడు యాదయ్య. స్వతహాగా చురుకైన వాడవడంతో యాదయ్య,

అనతికాలంలోనే మంచి కటింగ్ మాస్టరుగా ఎదిగాడు. తన నైపుణ్యంతో ఉన్నత వర్గాలవారిని ఆకట్టుకుని, ఎక్కువ కూలీసంపాదించే స్థాయికి చేరుకున్నాడు. దర్జీపనితో పాటు బట్టలుకూడా అమ్మడం మొదలుపెట్టాడు. నాణ్యమైన బట్టలు, వేరే షాపులకంటే చవకగా లభ్యం కావడంతో జనాలు అక్కడే బట్టలుకొని, కుట్టడానికిచ్చేవారు. తన చిరునవ్వుతో కూడిన మాటలతో, సరళ స్వభావంతో డబ్బున్న క్లైంట్లను ఆకర్శించాడు యాదయ్య. తన నలుగురు అత్తయ్యల పెట్టుపోతలకుసహాయపడటమేగాక, ముగ్గురు సొంతకూతుళ్లకు కూడా మంచి సంబంధాలు చూసి పెళ్లిళ్ళు చేశాడు. కొడుకును మంచి కార్పొరేట్ కాలేజిలో యం.బి.ఏ. చదివించాడు. కొడుకు సాయిప్రసాద్ తన యం.బి.ఏ. తర్వాత ఓ బహుళదేశకంపెనీలో డిప్యూటీ మానేజరుగా చేరి, రెండేళ్లలో మేనేజర్ గా ప్రమోషన్ పొందాడు. సాయి, తన తల్లిదండ్రులకు శ్రమ కల్గించకుండా, ఓ అమ్మయిని ప్రేమించి, వారికి తెలిపాడు. ఆ అంతర్మత పెళ్ళికి అమ్మాయి తల్లిదండ్రులు ససేమిరా అనడంతో, యాదయ్యే వారి పెళ్ళి భారం తన నెత్తిన వేసుకున్నాడు. ఇప్పుడు సాయి, తన పెళ్ళికి వచ్చిన కానుకల డబ్బుపై కన్నేశాడు. దానికి యాదయ్య భార్య మంగ వత్తాసు. మంగకు ఖర్చు చేయడం మాత్రమే తెలుసు. దర్పానికి పోయి, తమ కూతుళ్ల పెళ్ళిళ్లకు కూడా ఎన్నో వ్యర్థ ఖర్చులు

> తల్లీ కొడుకులు పెళ్లి కానుకలుగా వచ్చిన డబ్బు, కవర్ల నుండి తీయడంలో నిమగ్నమై ఉన్నారు. యాదయ్య మనసులో 'వాళ్ల వాలకం చూస్తే, ఎవరెంత డబ్బు కట్నంగా ఇచ్చారో, ఓ పట్టిక తయారు చేయాలనే ఇంగితం కూడా లేనట్టుంది.'

పెట్టించింది మంగమ్మ. మాట ఇచ్చినట్టు, తన పెళ్లికి, ఆర్థికంగా తన కొడుకు సహాయ పడకపోవడంతో యాదయ్యకు అప్పు చేయాల్సి వచ్చింది. అది తీరే మార్గం కూడా మూసుకుపోయింది. దీనంతటికీ తానిచ్చిన అలుసే కారణమా? తాను, తన పనిపై పెట్టిన శ్రద్ధ, కుటుంబ వ్యవహారాలపై పెట్టక పోవడంతో, వారు ఆడింది ఆట, పాడింది పాట అయింది. ఇంటి ఖర్చులు అదుపులో పెట్టుమని, తమ దాంపత్య మొదటి రోజుల్లోనే మంగను కట్టడి చేసుంటే, తనకు ఈ ఆర్థిక ఇబ్బందులు రాకపోవునేమో? అలాగే కొడుకు ఉద్యోగంలో చేరగానే, ఇంటి ఖర్చులకని నెలకింత ఇవ్వుమని నిలదీస్తే వాడి విచ్చలవిడితనానికి హద్దుండేదేమో?

తన బాధను ఎవరితోనైనా పంచుకుంటే తప్ప, ఉపశమనం కలిగేట్టు లేదు. వెంటనే బట్టలేసుకుని బయటికి నడిచాడు యాదయ్య. తమ ఇంటికి దగ్గర్లోని వైన్ షాపులో ఓ అర బాటిల్ విస్కీ, ఆ పక్క షాపులో, నంజుకోవడానికి కావలసినవస్తువులు కొని, ఆ నగరంలో తనకున్న ఒకే ఒక ఆప్తమిత్రుడు, నరహరి ఇంటి వైపుకు అడుగులు వేశాడతను. ఇద్దరు మిత్రులు ఓ గదిలో సెటిలై, మందు సీస మూత తీశారు. ఒక్క పెగ్ లోనికి పోగానే, యాదయ్యలోని ఆవేదన బయటికి వచ్చింది. "నరహరీ! మా వాళ్లు నన్ను నట్టేట ముంచిగాని, తృప్తి పడేట్టు లేరు. ఒంటి చేత్తో ఈ సంసార నావ ఎన్నాళ్లని నడపను?" యదయ్యలో మందు, తన ప్రభావం చూపిస్తోంది.

"ఇప్పుడంత కష్టమేమొచ్చింది యాదయ్యా? నీ షోరూం బాగానే నడుస్తోందిగా?"

"అంత సీన్ లేదు నరహరీ! ఇప్పుడు చాలామంది, బ్రాండెడ్, రెడీమేడ్ దుస్తులవైపు మొగ్గు చూపుతున్నారు. దానివల్ల మా వ్యాపారం మందగించింది. మా ఖర్చులకు తగ్గ ఆదాయం మాత్రం వస్తోంది. ఈ పరిస్థితుల్లో మా అబ్బాయి పెళ్ళికని చేసిన అప్పు తీర్చడం గగనంగా ఉంది."

"అదేంటి ! మీ అబ్బాయికి, ఇంటి అప్పు తీర్చే బాధ్యత లేదా?" నరహరి మరో ప్రశ్న సంధించాడు.

"వాడిలో అంత జవాబుదారీతనమే ఉంటే, ఇలా నీ ముందు బయటపడేవాడినా? పెళ్లి కాక ముందే ఒక్క పైసావిదిల్చనివాడు, పెళ్లైన తర్వాత మాత్రం నా బాధ్యతలో పాలు పంచుకుంటాడా?"

"అలా నీకు నువ్వే అనుకుంటే ఎలా? అప్పు తీర్చడానికి నెలకింత ఇవ్వాలని ఖండితంగా షరతు విధించు. నీ మాటవినకపోతే నాలాంటి వాళ్లని నలుగురిని పిలువు. మేమతన్ని ఇంటి బాధ్యత వహించేలా ఒప్పించే ప్రయత్నం చేస్తాం.

ఐనా వినకుంటే, తాడో, పేడో తేలుద్దాం" నరహరిలో ఉద్రేకం.

"అలా అంటే వేరు పడడమేగా? తల్లిదండ్రులతో పొసగక వేరుపడ్డ పిల్లలను చూశాను కాని, తండ్రే పిల్లలను ఇంటినుండిగెంటేసిన ఉదంతాలు చూడలేదు."

"నీ కొడుకు తానుకూడా సంపాదిస్తున్నప్పుడు, ఇంటి బాధ్యతలో కూడా పాలు పంచుకోవడం సమంజమే. ఇక లోకులంటావా? వారు నీవెలా ఉన్నా విమర్శిస్తారు" నరహరి కుండ బద్దలు కొట్టాడు.

"ముందే మా ఆవిడకు నేనంటే అలుసు. ముగ్గురు ఆడ కూతుళ్ళ తర్వాత పుట్టాడని, అబ్బాయిని చిన్నప్పటినుంచే గారాబం చేసింది. వాడిని నేనేమన్నా అంటే మా మధ్య సంబంధాలు ఇంకా చెడుతాయి."

"చూడు యాదయ్యా! లోగడ కార్ల్ మార్క్స్ అనే మహానుభావుడు "లోకంలో ఉన్న బంధాలన్నీ ఆర్థిక బంధాలే" అనిసూత్రీకరించాడు. ఊరికే నీకు నీవే మథన పడుతూ నీ భార్యా, కొడుకును అదుపులో పెట్టక పోతే జీవితాంతం బాధపడవలసి వస్తుంది.

అలాగే ఎదుటి వారికి, వారి బాధ్యత పై అవగాహన కల్పించాలి.లోకంలో, నడిచే ఎద్దునే పొడిచే అలవాటుంది. దానికిఎదురు తిరగడమొక్కటే మార్గం." నరహరి విశదీకరించాడు. అప్పటికి బాటిల్ ఖాళీ అవడంతో యాదయ్య మంచి జోరుమీదున్నాడు.

"నరహరీ! ఇక చూసుకో నా తడాఖా!" అంటూ తన ఇంటి వైపుకు అడుగులు వేశాడతను. అతని అడుగుల్లో ఓ కొత్తబలం. అది కేవలం అతను పుచ్చుకున్న మందు వల్ల మాత్రమే వచ్చింది కాదు.



–అంబల్ల జనార్దన్
సెల్:09987533225/
8850349858

ఆహ్వానం

మహిత సాహితీ
శ్రీ త్యాగరాయ గానసభ, హైదరాబాద్
సంయుక్త నిర్వహణలో–

శ్రీ నకరికంటి వేంకటేశ్వరరావు
పుట్టినరోజు సందర్భంగా
'నరికంటి పురస్కారాల ప్రదానోత్సవం-కవిసమ్మేళనం'

7 మే, 2022, శనివారం, సాయంత్రం 6 గంటలకు
కళా లలిత కళావేదిక, శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడ పల్లి, హైదరాబాద్

సభాధ్యక్షులు
దా. వడ్డేపల్లి కృష్ణ
ప్రముఖ కవి, సినీగేయ రచయిత, సినీ దర్శకులు

ముఖ్య అతిథి
శ్రీమతి దా. వై. జయప్రద
హెచ్.ఆర్ డైరక్టర్, అవంతి గ్రూప్ కళాశాలలు

విశిష్ట అతిథి
శ్రీ కళా వి.ఎస్. జనార్దన మూర్తి
అధ్యక్షులు, ప్రపంచ రికార్డుల శ్రీ త్యాగరాయ గానసభ

పురస్కార గ్రహీతలు
శ్రీమతి డా. శారదా పూర్ణ శొంఠి
సంగీత సాహిత్య సమలంకృత
శ్రీ కె.యల్. కామేశ్వర రావు
చమత్కార కవి
శ్రీ బైస దేవదాసు
నేటి నిజం పత్రికా సంపాదకులు

తొలి పలుకులు
శ్రీమతి స్వాతి శ్రీపాద
అధ్యక్షులు, మహిత సాహితీ

ప్రఖ్యాత కవయిత్రుల కవి సమ్మేళన నిర్వహణ
శ్రీమతి తమిరిశ జానకి
గౌరవాధ్యక్షులు, మహిత సాహితీ

వందన సమర్పణ
శ్రీమతి శిష్టా మాధవి
శ్రీ నకరికంటి పురస్కారాల ప్రదాత

శిష్టా మాధవి
కార్యదర్శి, మహిత సాహితీ

కళా శారద దీక్షితులు
కార్యదర్శి, శ్రీ త్యాగరాయ గానసభ

## అహం

(కథ )

రాముని పల్లి అనే ఊరిలో కవిత మరియు లక్ష్మి అనే స్నేహితురాళు ఉన్నారు. కవితది చాలా పేద కుటుంబం .లక్ష్మి ది చాలా డబ్బు ఉన్న కుటుంబం. కవిత చాలా మంచిది. అందరితో మంచిగా మాట్లాడుతుంది మరియు కలసిమెలసి ఉంటుంది.కాని లక్ష్మి ఎవ్వరితో మాట్లాడదు. ఎవరైన మాట్లాడిస్తే అహంతో మాట్లాడుతుంది .

లక్ష్మికి డబ్బు ఉందనే అహంతో అందరితో గొడవ పెట్టుకుంటుంది .కవితకి డబ్బు లేకున్నా ఉన్నదానిలో ఎవరికైన లేకపోతే సహాయం చేస్తుంది . కాని లక్ష్మికి డబ్బు ఉన్న ఎవ్వరికి సహాయం చేయదు.లక్ష్మి ఎప్పుడూ కవితతో గొడవ పెట్టుకుంటుంది .

ఒకరోజు కొంతమంది స్నేహితురాళ్లు కవితవారి ఇంటికి వచ్చారు .అందరు నవ్వుతూ కలిసిమెలసి ఆనందంగా ఉన్నారు.కాని లక్ష్మి వారి ఇంటికి ఎవ్వరు వెళ్ళరు. కవిత ఇంట్లో ఉన్న వారిని లక్ష్మి చూసింది . తనకు నచ్చలేదు .అందరు లక్ష్మిని చూసి భయపడతారు.ఎందుకంటే తను ఎప్పుడు గొడవ పెట్టుకుంటుంది .

" అందరు కవిత వారి ఇంటికి వెళ్ళుతున్నారు ఆమెతో చాలా మంచిగా మాట్లాడుతున్నారు . కాని నాతో ఎవ్వరు మాట్లాడడం లేదు , మా ఇంటికి ఎవ్వరు రావడం లేదు . ఎందుకు ? " అని తనలో తాను అనుకుంది .

లక్ష్మిఎప్పుడు ఎవ్వరింటికి వెళ్ళదు. ఆరోజు కవిత వారి ఇంటికి వెళ్ళి కొపంగా

" మా ఇంటికి ఎవ్వరు రావడం లేదు .వాతో ఎవ్వరు మాట్లాడడం లేదు .
" ఎందుకు ? " అని అడిగింది.

"నువ్వు ఎప్పుడు డబ్బు ఉందనే అహంతో ఉంటావు.ఎవ్వరిని మాట్లాడనివ్వవు .ఎవరైన మాట్లాడిస్తే అహంతో మాట్లాడుతావు.కవిత అందరిని మాట్లాడిస్తుంది మరియు అందరితో కలసిమెలసి ఉంటుంది .అందుకే మీ ఇంటికి ఎవ్వరు రావడం లేదు.మాట్లాడడం లేదు " అందరు అన్నారు.

అప్పడినుండి లక్ష్మి అందరితో కలిసిమెలసి ఉంటుంది.. అహంతో మాట్లాడడం లేదు. పేదవారికి సహాయం చేస్తుంది.

.నీతి : – మనుషులకు అహం ఉండకూడదు.



–సారుగు శ్రీజ
తొమ్మిదవ తరగతి
జక్కాపూర్ ఉన్నత పాఠశాల
సిద్దిపేట జిల్లా, సెల్ .9959007914







చీకటి
జీవితంలో
జ్ఞాపకాలు
నక్షత్రాలు–
అనుభవం
చందమామ!



–డా॥విప్లవ్‌దత్ శుక్లా
సెల్:9849185878

